

సంపాదకీయం

-- రెవ.బర్నబాస్ సజ్జా

# మారాల్సింది ఎవరు?



**(ఆంధ్రజ్యోతికి అభినందన)**

మతమన్నది నా కంటికి మసకైతే.... మతమన్నది నా కంటికి మబ్బైతే.... మతం వద్దు, గీతం వద్దు, మాయామర్మం వద్దు. అన్నాట్ట భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి. ''క్రూర ప్రపంచం చేతుల్లో నలిగిపోయేవారికి మతం ఒక ఊరట. ఏ మాత్రం ఆశాజనకం కాని పరిస్థితుల్లో ఇదొక ఆశాదీపం'' అన్నాట్ట కారల్ మార్క్స్ .

పైమాటలు మరియు అనేక మాటలు 9-11-2011 నుండి 15-11-2011 వరకు ''ఆంధ్రజ్యోతి'' దిన పత్రికలలో పతాక శీర్షికలలో వరుసగా వెలువడిన మాటలు ఆంధ్రజ్యోతి పత్రికా ప్రచురణకర్తలు తాము ప్రచురించిన వరుస కథనాలకు పెట్టిన పేరు ''ఏ మార్చే మతం''. రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా మత మార్పిడులు జరిగిపోతున్నాయనేది దీని ఘోష. పుట్టుకతో వచ్చిన మతాన్ని ఎందుకు విడనాడ వలసివచ్చింది? ''మతం మారాలనుకున్నపుడు అసలు మన మతంలో ఏ ముందో వేరే మతంలో ఏముందో తెలుసుకోవాలి కదా? మారేవాళ్ళంతా ఏం అధ్యయనంచేసి నిర్ణయం తీసుకుంటున్నారు?'' అనేది పత్రికలో వచ్చిన ప్రశ్నలు. ''బస్తీలో జనం అనారోగ్యం పాలైతే ఉచిత వైద్య శిభిరాలు ఏర్పాటు చేస్తారు. వైద్యం అందిస్తూనే ప్రార్ధనలు చేస్తారు... కుటుంబ సభ్యుల్లో ఎవరైనా చనిపోతే... అక్కడికి చేరుకుని ప్రార్ధనలపేరట కౌన్సిలింగ్ నిర్వహిస్తారు.'' మారు మూల గ్రామంలో ఒక ఆస్పత్రి తెరచి... నిరుపేదలకు వైద్యం అందిస్తే! అక్కడ ఓ బడి తెరచి విద్యా దానం చేస్తే! వరద పోటెత్తినా, కరువు కాటేసినా 'మేమున్నాం' అంటూ ముందుకు వచ్చి ఆపన్న హస్తం అందిస్తే! అదే మానవత్వం. ఇవన్నీ ఆంధ్రజ్యోతి వ్రాతలు.

క్రైస్తవ్యం మానవత్వానికి చక్కటి ప్రతిరూపం. ఈ మానవత్వాన్ని తమ పట్ల చూపించడానికి గల కారణం మహోన్నతుడైన క్రీస్తుప్రేమ అని ప్రజలు గుర్తించగలుగుతున్నారు. అలా గుర్తించగలిగిన వ్యక్తులు నిజమైన మానవతావాది, ప్రేమ స్వరూపి, త్యాగశీలియైన క్రీస్తు స్వామివైపుకు మళ్ళుకుంటున్నారు. క్రైస్తవ్యం చూపే మానవత్వమే మానవాళికి మహోన్నతమైన మార్గదర్శకంగా మారి, ఆదరణ పొందే ప్రతివ్యక్తీ ఆదరించే వ్యక్తిగా మారడానికి అవకాశంగా మారుతుంది. క్రీస్తు సూత్రాలు, మనుష్యులలోని మలిన ప్రక్రియలను విడనాడి సన్మార్గ వర్తనులుగా మారడానికి దోహదం చేస్తున్నాయి.

మతం పేరుతో ఇంత గగ్గోలు పెట్టిన ఈ కదంబాల రచయితలకు గాని, పత్రికా యాజమాన్యానికి గాని అసలు ఎవరిది ఏమతమో తెలుసా? పుట్టుకతోనే ఎవరైనా మతంలో పుడ్తారా? ఉపాధ్యాయుని బిడ్డలు ఉపాధ్యాయులుగానే కొనసాగుతున్నారా? వైద్యుని బిడ్డలు

**క్రైస్తవ్యం చూపే మానవత్వమే మానవాళికి మహోన్నతమైన మార్గదర్శకం**

వైద్యులవుతున్నారా? కమ్మరివాని బిడ్డలు కమ్మరి వృత్తిలో, కుమ్మరి వాని బిడ్డలు కుమ్మరి వృత్తిలో, మంగలి బిడ్డలు మంగలి వృత్తిలో వుంటున్నారా? మీరు మీ తల్లిదండ్రుల వృత్తిని ఎందుకు అనుసరించలేదు? పత్రికా ప్రతినిధులుగా, పత్రికా రచయితలుగా ఎందుకు మారారు? మీ పత్రికా ముఖంగా వెల్లడిచేస్తున్న అవినీతి చిట్టాలను అవగతం చేసుకొని అవినీతి ప్రభంజనంలో నుండి బయట పడేవారిని మీరు బలవంతం చేస్తున్నారని, మార్చేస్తున్నారని అనడం సమంజసమా? సత్యాన్ని వెల్లడి చేయడం పత్రికా ప్రతినిధులుగా మీకెంత ధర్మమో, సత్యసంధుడు, ప్రేమా మూర్తి, పరిశుద్ధుడైన క్రీస్తు జీవితాన్ని ప్రజలకు చాటి చెప్పడం ప్రజలను సన్మార్గానికి నడిపించడం మాకంతకంటే మిక్కుటమైన ధర్మం.

ఇక్కడ ప్రతి ఒక్కరూ గమనించవలసిన ఓ సత్యం వుంది. కుళ్ళిపోయి, కంపుకొడ్తూ మతం పేరుతో ప్రజలను వంచిస్తున్న దగాకోరు మతనాయకుల కుతంత్రాలను తన ప్రేమతత్వంతో, క్షమా గుణంతో ఎండగట్టి దేవుణ్ణి దేవునిగా చూపించినవాడు క్రీస్తు స్వామి. మీరు పదేపదే మతం, మతం అని వ్రాసే వ్రాతలకు క్రైస్తవ్యంలో చోటు లేదు. సమస్త జనులకు ప్రార్థన మందిరంగా వుండవలసిన ప్రార్థనా మందిరాన్ని వ్యాపారపుటిల్లుగా మార్చివేసిన నాటి మత చాందస నాయకత్వపు తీరు తెన్నులకు బహుగా చలించిపోయి ఓ అద్భుత సంస్కరణకు నాంది పలికిన వాడు నాయేసుస్వామి. పాపాత్ముల బలహీన మనస్తత్వాలతో చెలగాటలాడుతూ వారిని మరింత పాపపు రొంపిలోనికి దించే దుష్ట సమాజపు చేతుల్లో నుండి వారికి విముక్తి ప్రసాదించి వారిని పవిత్ర మూర్తులుగా మార్చిన క్షమాగుణం మూర్తీభవించిన ఘనుడు నా యేసుస్వామి. ప్రతీకార వాంఛకు తావివ్వకుండా ద్వేషించేవారిని ప్రేమించమని, కీడుకు ప్రతికీడైనను, దూషణకు ప్రతిదూషణయైనను చేయక దీవించండని చెప్పిన పుణ్యమూర్తి నా యేసుస్వామి. మనుష్యుల జీవితాలలో మార్పుకోసం కత్తిపట్టకుండా, కర్కశత్వాన్ని చూపకుండా కరుణరసాన్ని ఒలికించి, ప్రేమామృతాన్ని కురిపించి, తన రుధిర ధారలను చివరి బొట్టు వరకు నాకోసం, మీకోసం, అందరికోసం చిందించిన త్యాగశీలి నా యేసుస్వామి. యేసును సరిగ్గా అర్థం చేసుకున్న వ్యక్తులు ఖచ్చితంగా మారితీరుతారు. వారు మతం కాదు మారేది. మనస్సును మార్చుకుంటారు. క్రైస్తవ్యం ఓ మతంకాదు. ఇది ప్రపంచ ప్రజానీకానికి దిశా నిర్దేశాన్ని చూపగల అద్భుతమైన ఏకైక మార్గం. మతాల్లో ఏమున్నాయెూ తెలుసా అని మరలా అడుగుతారా? మతాల్లో ఆచారాలున్నాయి. వైషమ్యాలున్నాయి. మతం పేరుతో మానవులను పీడించుకు తినే కుసంస్కృతి వుంది. అందుకే క్రీస్తు తత్వం నిజంగా అర్థం చేసుకున్న వ్యక్తులెవరూ మతం మారమని ప్రచారం చేయరు. కానీ మతాలు వీడండి, మానవత్వాన్ని చేపట్టండి. ప్రేమ మూర్తి యేసుస్వామిని వెంబడిస్తూ పవిత్ర సామ్రాజ్య నిర్మాణ సారధులు కండి అంటూ బోధించి తీరుతారు.

నేను మతం మారలేదు కానీ మతం వీడాను. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు 'మతం వద్దు, గితం వద్దు మాయామర్మం వద్దు' అన్నట్లు మతాన్ని వీడి, మత ఆచారాలను వీడి, ఆచరణాత్మక క్రీస్తు జీవిత విధానాన్ని అనుసరిస్తున్నాను.

ఆంధ్రజ్యోతి పత్రికలో వ్రాసినట్లు "మతం మారుతున్న పిల్లలు తమ ప్రత్యక్షదైవాలైన తల్లి దండ్రులను మరిచిపోతుండడం మరో విషాదం" ఇది పెద్ద అబద్ధం. తల్లి దండ్రులను సన్మానించుమని పవిత్ర గ్రంథ ప్రబోధం. క్రీస్తును అనుసరించేవారు మునుపటికంటే ఎక్కువగా తల్లిదండ్రులను ప్రేమిస్తారు. స్వార్థపూరిత ప్రపంచంలో పిల్లల ఆలనా పాలనా

**ప్రపంచ ప్రజానీకానికి దిశానిర్దేశం చూపగల అద్భుతమైన ఏకైక మార్గం క్రైస్తవ్యం**

పట్టించుకోకుండా, ధనార్జన కోసమే క్షుద్ర దేవతలను ఆరాధించే తమ తల్లిదండ్రుల మనోనేత్రాలు తెరిపించగల ఆదర్శవంతులైన పిల్లలుగా మారుతారు. క్రీస్తు మార్గాన్ని అనుసరించడం విషాదం ఎన్నడూ కాదు. అది నూటికి నూరు పాళ్ళు వికాసమే.

ఒక యువకుని తండ్రి ఇంజనీర్. అతని కుమారునికి డాక్టర్ కోర్సు చేయాలనిపించింది. తండ్రి వద్దన్నాడు. చదవలేవన్నాడు. అయినా కుమారుడు డాక్టర్ కోర్సుకు పంతం పట్టాడు. పట్టభద్రుడయ్యాడు. డాక్టరయ్యాడు. తండ్రి అతిశయంగా మా అబ్బాయి డాక్టర్ అని చెప్పుకోవడం ప్రారంభించాడు. అందరూ ఆ తండ్రిని ఇంజనీర్‌గారు అని పిలవడం మానేసి డాక్టర్ గారి తండ్రి అనడం మొదలుపెట్టారు. ఇది తండ్రికి విషాదమా? లేక తండ్రికి ఘనతా? ఆలోచించండి.

క్రీస్తును అంగీకరించిన బిడ్డలు నిశ్చయంగా తలితండ్రులకు ఘనత తెస్తారేగాని అవమానం ఎట్టి పరిస్థితుల్లోను తేరు. ఇదేదో తక్కువ మతమనే పేరుతో కొంతకాలం కొందరు తల్లిదండ్రులు దీనిని అవమానంగా భావిస్తారు. క్రీస్తు బాటలో పవిత్రతతో నడిచే బిడ్డలు అనతికాలంలో ఆ భావాలను చెరిపివేసి తల్లిదండ్రుల ఘనతకు హేతువులుగా మిగులుతారు.

నేను మతాన్ని వీడి, క్రీస్తు మార్గాన్ని అనుసరించిన తొలిదినాల్లో నా బంధుమిత్రులు కొందరు నన్ను గూర్చి పై విధంగానే భావించారు. కానీ నేడు అందరూ సగర్వంగా మా పాస్టర్ బాబు అని పెద్దవాళ్ళు, మా పాస్టరన్నయ్య అని చిన్నవాళ్ళు చెప్పుకుంటూ వుంటే ఆనందంగా వుంది. ఈ సమాజంపైన, నా బంధుమిత్రులపైన క్రీస్తు ముద్రలు స్పష్టంగా ముద్రించబడాలని, క్రీస్తు పవిత్ర పదజాడలలో కల్మషంలేని, వైషమ్యం లేని జీవితం వారు జీవించి నిత్యజీవ ప్రాప్తి (మోక్ష) పొందాలని నా ఆకాంక్ష.

ఆంధ్రజ్యోతి వరుస కథనాలలో ''వై యేసు మార్గం''! అనే పేరుతో క్రీస్తు మార్గాన్ని దివంగత ముఖ్యమంత్రి వై.యస్ రాజశేఖర రెడ్డి గారికి ఆపాదిస్తూ వై.యస్. పరిపాలనలో క్రైస్తవ ప్రచారం విరివిగా జరిగిందని, వై.యస్. క్రైస్తవులకు ఏదేదో చేసేసారని వ్రాశారు. నిజంగా ఆలోచిస్తే క్రైస్తవ్యానికి నష్టం కలిగింది వై.యస్. పాలనలోనే. ఆయా దేవస్థానాలకు సరి హద్దులను విధించి ఆ ప్రాంతాల్లో క్రీస్తు ప్రబోధాలు వినిపించరాదని, కరపత్రికలు పంచరాదని ఆంక్ష విధించింది ఆయనే. ఆయన దుర్మరణం పాలయినపుడు **ABN** చానల్లోగాని, మిగిలిన చానల్స్‌లో గాని ఆయన హిందూ దేవస్థానాలకు, పూజారులకు చేసిన ఉపకారాలను ఏకరువుపెట్టి, కన్నీరు కార్చిన పూజారుల తీరు ఆయన క్రైస్తవ్యానికి ఉపకారి అని చెప్పాయా? హిందూమతానికి ఉపకారి అని చెప్పాయా? క్రైస్తవ విధానాలకు భిన్నంగా, క్రీస్తుతత్వానికి భిన్నంగా అనేక మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొని, వాటిలో పాల్గొనమని రాష్ట్ర ప్రజానీకాన్ని రెచ్చగొట్టింది వై.యస్ గారు కాదా? వారి తల్లి, కుటుంబసభ్యులు క్రైస్తవులైనందున, క్రైస్తవులు, క్రైస్తవేతరులు ఆయనకు క్రైస్తవ ముద్రను ఆపాదించినా, ఆంధ్రరాష్ట్రంలో మునుపెన్నడూ, ఏ ముఖ్యమంత్రీ పాల్గొననంత ఎక్కువగా క్రైస్తవేతర మతకార్యకలాపాల్లో, విగ్రహారాధనల్లో పాల్గొని క్రైస్తవ విలువలను దిగజార్చింది, విగ్రహారాధనను పురికొల్పింది ఆయనగారు కాదా! తన దుర్మరణానికి ముందు రాష్ట్ర ప్రజానీకాన్ని అంతటిని వరుణయాగానికి పురికొల్పింది ఆయనగారు కాదా? ఆనాటి పరిణామాల విషయమై రాష్ట్రానికి, వారి కుటుంబానికి సంభవించబోయే దుస్థితి కొరకై ఎందరో క్రీస్తు అనుయాయులైన వారి సన్నిహిత బంధువులు, దైవజనులు ప్రార్థించారు, పరోక్షంగా హెచ్చరించారు. ఈనాడు

రాష్ట్రం ఈ దుర్భర పరిస్థితులను అనుభవిస్తూవుంది. వీటన్నిటిని విశ్లేషించి చూస్తే క్రైస్తవ్యానికి ఆయన చేసింది ఏమిటి? క్రైస్తవ్యానికంటే ఎన్నో వందల రెట్లు అధికంగా యితర మతాలకు ఆయన ఉపకారం చేశారని చెప్పక తప్పదు. క్రైస్తవ్యాన్ని వై.యస్ గారికి అంటకట్టడం ద్వారా, ఆయనను క్రైస్తవ పక్షపాతిగా చూపించడం ద్వారా ఆంధ్రజ్యోతి పత్రిక ఓ ఘోరమైన తప్పిదంలో తలదూర్చడం నిజంగా ఓ విషాదం.

యికపోతే 'ఆంధ్రజ్యోతి' కథనాలలో హిందూ దేవతలను క్రైస్తవ మత ప్రచారకులు దూషిస్తున్నారని పలుమార్లు పేర్కొన్నారు. ఎవరైనా ఒకవేళ అలా దూషణలకు పూనుకుంటే అది ఖచ్చితంగా తప్పే అని నేను అంగీకరిస్తాను. దూషణలతో సత్యాన్ని ఎవరూ వ్యాప్తి చెందించలేరు. ప్రేమ తత్వమొక్కటే ప్రజలలో పరివర్తన తెస్తుంది. కానీ కొందరు దైవజనులు ఆయా వ్యక్తులతో తర్కవితర్కాల సమయంలో వెల్లడించిన కొన్ని వాస్తవాలను దూషణలని ప్రచారం చేసి మత విద్వేషాలను రెచ్చగొట్టడం కడుశోచనీయం.

ఇంతకూ హిందూ మతం ఒక మతమేనా? అది ఎన్నో మతాల సమ్మిళితం. పరస్పర దూషణ, భూషణ తిరస్కారాదులు ఈ మతంలో వున్నంతగా ప్రపంచంలోని ఏమతంలోనూ లేవనేది అందరూ అంగీకరించే సత్యం. వేద, పురాణకాలాలలో ఒక దేవుణ్ణి మరోదేవుడు తిట్టుకున్నట్లుగా పేర్కొన్న సంఘటనలు అనేకములు. పౌరాణిక గాథల నిండా, సినిమాలు, నాటకాల నిండా ఒక దేవతపైన ఒక దేవత విరుచుకు పడలేదా? ఘోరమైన, భీకర యుద్ధాలు సల్పలేదా? ఉచ్ఛరింప నశక్యమైన రీతిలో భార్యా భర్తల సంబంధాలను చివరికి వారిని కన్నతల్లిదండ్రులను సహితం తూలనాడే విధంగా పరుష పదజాలాలు వాడలేదా? ఎందుకండీ ఈ అస్థవ్యస్థమైన వ్రాతలు. మిమ్ములను మీరు తిట్టుకుంటూ వుంటే ఆ తిట్లు వినీ వినీ నోరు ఊరుకోని ఓ క్రైస్తవ వ్యక్తి వాటినే తిరిగి ఉదహరిస్తే దూషిస్తున్నారని విరుచుకుపడుతున్నారు. తిరిగి మతగ్రంధాలలోని ఈ దూషణలను, తిరుగు బాట్లను, యుద్ధాలను, అవివేక లక్షణాలను సంస్కరించుకొని సక్రమంగా మెలగడానికి ఈ పత్రికలేమైనా దారి చూపగలవా? ఇంటిలోని వారు తన్నుకోవడం, విమర్శించుకోవడం మానేస్తే, వారిని విమర్శించేవారి నోళ్ళు ఖచ్చితంగా మూతపడి తీరుతాయి. ఈ దేశంలో మతం పేరుతో జరిగిన పైశాచిక ప్రభంజనాలకు అడ్డుకట్టవేసింది క్రైస్తవ్యం కాదా? దేశ సంస్కరణ ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది మేధావులు క్రైస్తవ విశ్వ విద్యాలయాల్లో చదవలేదా? బలవంతంగా వారిని ఎవరైనా మార్చారా? వారిలో అనేకులు క్రైస్తవ్యంలో ప్రత్యక్షంగా అడుగిడకపోయినా పరోక్షంగా క్రీస్తు అడుగుజాడలను అనుసరించి దేశాభ్యున్నతికి దోహదపడ్డారు. అందుకు సంతోషం. క్రైస్తవ్యం మతపు ముసుకులో నుండి అనేకులను వెలుపలకు లాగి సంస్కరించింది. పవిత్ర వేదమైన బైబిలులో పౌలు భక్తుడు వ్రాసినట్లు "మధ్య గోడలను పడగొట్టి ఉభయులను ఏకం చేసింది" క్రైస్తవ్యం.

క్రీస్తు ప్రభోధాలను మతపు ముసుగులో చూచేవారికి అవి దేశ సమైఖ్యతకు ముప్పులా కన్పిస్తాయి. అలాంటి వారు సమైఖ్యతను తమంతట తామే విచ్ఛిన్నం గావించుకుంటారు. కానీ మతపు ముసుకులను తొలగించుకొని చూస్తే మత చాంధసభావాలను వీడి నిజమైన సమైఖ్యతతో ముందుకు సాగగలుగుతారు. సత్యం ద్వారానే సమైఖ్యత సాధ్యం. సత్యం, అసత్యాల మధ్య సమైఖ్యత కొనసాగడం దుర్లభం.

చివరగా, ఆంధ్రజ్యోతిలో ప్రస్తావించినట్లు 'మతమే' మారాలి అనే వ్యాసం చాలా బావుంది.

అసలు మతాలు, మనుషుల, మనసులూ మారాలన్నేదే ఆంధ్రజ్యోతి ఉద్దేశం, సందేశం అని తేల్చి చెప్పేశారు. అదే వాస్తవమైతే అందుకు అందరూ ఖచ్చితంగా ఆంధ్రజ్యోతిని అభినందించి తీరవలసినదే. ఆంధ్రజ్యోతి కధనాలలోని ఈ చివరి మాటలు చదువుతున్నప్పుడు నాకు పవిత్ర గ్రంధంలో సొలోమోను వ్రాసిన ప్రసంగి గ్రంధంలోని చివరి మాటలు గుర్తొచ్చి ఒకింత నవ్వొచ్చింది. (అజ్ఞానపు మాటలకు) మరొక వైపు ఆనందం వేసింది. (సత్యాన్ని గ్రహించి పరోక్షంగా దాన్ని వెల్లడి చేసినందుకు) ప్రసంగి గ్రంధమంతటిలో "వ్యర్ధం, వ్యర్ధం, సూర్యుని క్రింద సమస్తము వ్యర్ధం" అనే నిరాశావాదాన్ని మతిభ్రమించిన వానిలా వివరించి చిట్టచివరికి "మనుష్యులందరూ దేవుని యందు భయభక్తులు కలిగి ఆయన ఆజ్ఞలను, కట్టడలను అనుసరించి నడుచుకొనుచుండవలెను. ఇదియే మానవకోటికి విధి" అన్నాడు. అద్భుతంగా వుందికదూ ఈ మాటలతీరు.

చివరిగా, క్రైస్తవ సోదరీ సోదరులకు విన్నపం. రెండువేల వత్సరాలకు పూర్వం మానవజాతి అంధకారస్థితిని దూరపర్చి వెలుగుచూపడానికి వచ్చిన క్రీస్తు మార్గాన్ని సరిగా అనుసరించండి. మనమంతా ఆయన అడుగుజాడలలో నడుచుకొనునట్లు ఆయన మనకొరకు మాదిరివుంచి వెళ్ళాడు. ఆయన అడుగు జాడల్లో నడవడం నేర్చుకోండి. ఆయన పుట్టుక మొదలు జీవితాంతం వరకు జీవించిన ఆదర్శవంతమైన జీవితాన్ని తలపోస్తూ నీతిగా, పవిత్రంగా జీవించండి. ఆర్భాటాలను, ఆందోళనలనూ వీడి, ఆదర్శంగా బ్రదకడం నేర్చుకోండి.

దయచేసి క్రైస్తవ మతంలోకి ఎవరినీ దించకండి. ఒకనిని మీ మతంలో కలుపుకోవడానికి సముద్రాన్ని భూమిని చుట్టి వస్తారు. తీరా వాడు మీమతంలో కలిసిన తర్వాత వాడిని మీకంటే ఏడంతలు నరకపాత్రునిగా చేస్తారని యేసయ్య చెప్పిన మాటలు గుర్తుచేసుకోండి. మారిన హృదయాలతో మనుష్యులను మంచి మార్గం వైపుకు మరల్చడానికి పూనుకోండి. ఏదో లబ్ధిని ఆశించి మతబోధలు చేసి మతనాయకుల తృప్తికోసం, మీ భుక్తి కోసం మత బోధలు చేయకండి, మత మార్పిడులు చేయకండి. క్రీస్తులా జీవించండి. ఆయనను మనసా, వాచా కర్మణా అనుసరిస్తూ ఆయనను మీ జీవితాల ద్వారా లోకానికి చాటి చెప్పండి. క్రైస్తవ మత పోకడలు విడనాడండి. మనకు మతం వద్దు. క్రైస్తవ మతంలోవున్నా మరేమతంలో వున్నా మతాన్ని వీడండి. మార్గాన్ని అనుసరించండి.

క్రీస్తే నిజమైన మార్గదర్శి. ఈ సందేశం విషయంలో రాజీపడవలసిన అవసరతగాని, భయపడవలసిన అవసరతగాని మనకు అక్కరలేదు. వేరొకరు వేలుపెట్టి వెక్కిరించే పరిస్థితిని తెచ్చుకోవద్దు. మన సమాజం ఖచ్చితంగా మారితీరాలి. దానికి మనం మార్గదర్శకులం కావాలి.

వ్యాపారాత్మక దోరణులతో సాగుతున్న మతాలకు సంస్కరణలు గిట్టవు. సంస్కరణ తమ మత వ్యాపారాలకు గొడ్డలిపెట్టుగా భావించి కొందరు మత మార్పిడులు అని పేరుపెట్టి మనస్సు మార్చుకొని సన్మార్గాన్ని అనుసరిస్తున్న వారిని దేశానికే శత్రువులుగా భూతద్దంలో చూపించి లేనిపోని వైషమ్యాలను రెచ్చగొట్టి అంతమొందించ ప్రయత్నిస్తున్నారు.

యేసు జన్మించిన వేళ ఆయనను అంతమొందించడానికి నాటి రాజకీయ శక్తి (హేరోదు) కంకణం కట్టాడు. ఆయనను అడ్డు తొలగించుకోవడానికి నాటి మతశక్తి (ప్రధాన యాజకులు, శాస్త్రులు, పరిసయ్యులు) తీవ్ర ప్రయత్నాలు చేశారు. కానీ ఆయన ప్రేమ, త్యాగం సమాజానికి ఎంతో మేలు చేసింది, చేస్తూంది.

**దూషణలతో సత్యాన్ని ఎవరూ వ్యాప్తి చెందించలేరు. ప్రేమ తత్వమొక్కటే ప్రజల్లో పరివర్తన తెస్తుంది**

యేసు సందేశం మతం మారమని కాదు మారుమనస్సు పొందమని. మారుమనస్సు పొందిన వానికి మతంతో పనిలేదు. మత ఆచారాలతో పనిలేదు. మారుమనస్సుకు తగిన జీవితాన్ని జీవిస్తూ మాటల్లో, చూపుల్లో, చేతల్లో క్రీస్తును ప్రతిబింబింపచేయడమే చేయవలసిందల్లా. అలా చేస్తే మన ప్రజలు మతాలు వీడి మహోన్నత రక్షకుడైన క్రీస్తును హృదయంలో చేర్చుకుంటారు. అపుడే మానవాళికి మహోదయం.

యింతకూ మత మార్పిడులు చేస్తున్నది ఎవరు? బలవంతంగా హిందూమతంలోకి వేలాది మందిని లాగి వారికి హిందూ సర్టిఫికేట్స్ ఇస్తున్నది ఎవరు? ఆయా మత ధర్మాలకు విరుద్ధంగా నిమ్నజాతుల వారిని ప్రలోభపెట్టి, దేవాలయ ప్రవేశాలు కల్పిస్తామని చెప్పి వారిని మతచాందస విధానాల్లోకి లాగుతున్నదెవరు? క్రైస్తవ్యాన్ని స్వీకరించిన హరిజన, గిరిజన వర్గాల వ్యక్తులకు కుల బహిష్కరణను విధిస్తూ, కులం పేరుతో వారిని చిన్నచూపు చూస్తూ వారిని కించపరుస్తున్నదెవరు? వారికి కులపు తోకను అంటగట్టి, వారి మధ్యలోనే చిచ్చుపెట్టి వారి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వైషమ్యాలు తెచ్చిపెట్టింది ఎవరు? వీటన్నిటి వెనుక సమాజాన్ని దిగజార్చే, సాటిమానవుడ్ని పశువుకన్నా కనాకష్టంగా, నీచంగా చూచే మతం లేదా? మతపు ముసుగులో మారణహోమాలను సృష్టిస్తూ వున్న ఈ అకృత్యపు విధానాలను సరిదిద్దే దిశగా పత్రికలు ఎందుకు ప్రయత్నించవు? రాజకీయాలు తమ మనుగడ కోసం ఈ విధానాలకు వంతపాడడం లేదా? ఇది సర్వులకూ విదితమైన సంగతి కాదా? కులం పేరట రిజర్వేషన్లు ప్రతిపాదించి, క్రైస్తవ్యాన్ని బలవంతంగా అణచివేస్తూ, మరోవైపు అగ్ర మరియు నిమ్న కులాల మధ్య చిచ్చు రేపుతున్నది మతం, మతరాజకీయాలు కాదా? వీటికి జవాబులు సరిగా యివ్వలేనపుడు, వీటిని సరిదిద్దలేనపుడు మతం మారుతున్నారు మొర్రో అంటూ మొత్తుకోవడమెందుకు?

మేము మతం మార్చడంలేదు. మనుష్యులను మంచి మార్గానికి నడిపిస్తున్నాం. దేశానికి మేలు చేస్తున్నాం. కీడుచేయడం లేదు, దుర్వ్యసనాలు మాన్పుతున్నాం. సన్మార్గవర్తనులుగా తీర్చిదిద్దుతున్నాం. దీన్ని అడ్డుకోవడం నిజంగా మతమౌఢ్యం, గిట్టనితనం. దీనిని అర్థం చేసుకొని సక్రమంగా వ్యవహరిస్తే పరిస్థితులు చక్కబడతాయి. మన సమాజం క్షేమాభివృద్ధిని పొందాలని అభిలషిస్తూ

*క్రీస్తు జన్మదిన శుభాకాంక్షలతో*

**మీ సజ్జా**

పాఠకులకు

**క్రిస్మస్**

శుభాకాంక్షలు